సాక్షి చిత్తూరు

శుక్రవారం ¦ 19 ¦ జూలై ¦ 2024



వక్రీకరించి విషప్రచారం

వాస్తవాలను వక్రీకరించి, టీడీపీ శ్రేణులు విషప్రచారం చేయడం తగదని మాజీ మంత్రి రోజా హితవు పలికారు. - 8లో



హెల్మెట్ వాడకం తప్పనిసరి


ద్విచక్ర వాహనదారులందరూ తప్పనిసరిగా తలకు హెల్మెట్ ధరించాలని జిల్లా జడ్జి భీమారావు తెలిపారు. - 8లో



ప్రేమ విఫలమై యువతి ఆత్మహత్య

ప్రేమించిన యువకుడు మూడేళ్ల తరువాత పట్టించుకోకపోవడంతో యువతి ఆత్మహత్యకు పాల్పడింది. - 8లో

తండ్రి.. తనయుడే టార్గెట్





కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలుకుని రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని సరికొత్త రాజకీయ విష సంస్కృతికి ఆజ్యం పోసింది. ప్రజాసేవకు బదులు ప్రతిపక్షాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా అరాచకాలు, దౌర్జన్యాలు, ఆస్తుల విధ్వంసం, హింసాత్మక దాడులతో పేట్రేగిపోతోంది. వైఎస్సార్ సీపీ కార్తకర్తలు, సానుభూతిపరులు, ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులపై దాడులకు తెగబడటమే లక్ష్యంగా 'రెడ్‌బుక్ రాజ్యాంగం' నడుస్తోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. పుంగనూరులో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్పపై టీడీపీ మూకలు చేసిన దాడుల్ని చూసి ప్రజానీకం నివ్వెరపోతోంది.

అంతటా రెడ్‌బుక్ రాజ్యాంగమే..

- పెద్దిరెడ్డి కుటుంబ సభ్యుల విజయాన్ని జీర్ణించుకోలేని కూటమి
- ఎంపీ, ఎమ్మెల్యే రాకపోకలు, నివాసానికి వచ్చి వెళ్తున్న వారిపై నిఘా
- వారిద్దరూ పుంగనూరులో పర్యటిస్తే టీడీపీకి మనుగడ ఉండదని కుట్రలు
- 40 రోజులుగా ఎంపీ, ఎమ్మెల్యేలను హౌస్ అరెస్ట్ చేసి నిర్బంధించిన ప్రభుత్వం
- పుంగనూరు, కుప్పంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులే లక్ష్యంగా తెగబడుతున్న వైనం
- భయపెట్టి, దాడులు చేసి వైఎస్సార్‌సీపీ శ్రేణులను లొంగదీసుకుంటున్న టీడీపీ
- కూటమి నేతల అరాచకాలతో భయం గుప్పెట్లో పచ్చని పల్లెలు



పుంగనూరులో మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటి వెలుపల దాడులు చేస్తున్న తెలుగుదేశం కార్యకర్తలు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: తండ్రీ కొడుకులే లక్ష్యంగా కూటమి పెద్దలు అడుగులు వేస్తున్నారు. నివాసం నుంచి తమ సొంత నియోజకవర్గంలోకి అడుగుపెట్టనివ్వకుండా పోలీసులతో అడ్డుకుంటున్నారు. నియోజకవర్గంలోకి అడుగుపెడితే టీడీపీ మూకల చేత దాడులకు ఉసిగొల్పుతున్నారు. ఎన్నికల ఫలితాల వెల్లడి అనంతరం చోటు చేసుకుంటున్న పరిణామాలే ఇందుకు నిదర్శనం. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుల్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ముఖ్యులు. ఎన్నికల సమయంలో వీరిద్దరికీ రాయలసీమతో పాటు, ఏలూరు, కాకినాడ జిల్లాల బాధ్యతలు కూడా అప్పగించిన విషయం తెలిసిందే. ముఖ్యంగా చంద్రబాబు ప్రాతినిధ్యం వహించిన కుప్పం నియోజకవర్గంపై పెద్దిరెడ్డి కుటుంబం ప్రత్యేక దృష్టి సారించింది. నియోజక వర్గాన్ని అభివృద్ధి చేయడంలో కానీ, కుప్పం బ్రాంచ్ కెనాల్‌కి కృష్ణానది నీటిని తీసుకొచ్చే విషయంలో తండ్రీ కొడుకులిద్దరూ ప్రత్యేక శ్రద్ధ వహించారు. ఎన్నికల్లో రాజంపేట పార్లమెంట్ అభ్యర్థిగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పుంగనూరు ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి గెలుపొందారు. పెద్దిరెడ్డి కుటుంబంలో పోటీచేసిన ముగ్గురూ విజయం సాధించటంతో కూటమి పెద్దలు జీర్ణించుకోలేకపోతున్నారు. వచ్చే ఎన్నికల సమయం వరకు తండ్రీ కొడుకులు ఇలాగే కొనసాగితే మళ్లీ ఓటమి తప్పదని భావించిన కూటమి పెద్దలు సొంత నియోజకవర్గంలో కూడా తిరగనివ్వకుండా అడ్డుకుంటున్నారు. అలాగే తండ్రీ కొడుకులకు మద్దతుగా నిలుస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను పూర్తిగా అణగదొక్కేందుకు నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్నారు.



పుంగనూరులో మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటిలోకి ప్రవేశించి దాడులు చేస్తున్న టీడీపీ కార్యకర్తలు



పోలీసులు అడ్డుకుంటున్నా రెడ్డెప్ప ఇంటివద్ద తోసుకువస్తున్న టీడీపీ కార్యకర్తలు

సొంత నియోజకవర్గంలో పర్యటించకుండా..

ఎక్కడో పాకిస్తాన్, బిహార్‌లో ఇలాంటి సంఘటనలు చూస్తుంటాం, వింటుంటాం. ప్రజాస్వామ్య దేశమైన భారతదేశం, ప్రశాంతతకు, పవిత్రతకు, ఆధ్యాత్మికతకు నిలయమైన ఆంధ్రప్రదేశ్‌లో ఇలాంటి ఘటనలు చూస్తామని, వింటామని కలలో కూడా అనుకుని ఉండరేమో! కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రశాంతమైన ఏపీలో, ముఖ్యంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో హింసాత్మక దాడులు, దౌర్జన్యాల సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.



జూన్ 30న పుంగనూరు పర్యటనకు వెళుతున్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి హౌస్ అరెస్టు నోటీసు ఇస్తున్న పోలీసులు (ఫైల్)

రాజంపేట పార్లమెంట్, పుంగనూరు నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కావాలని ఓట్లేసి గెలిపించుకున్నారు. స్థానికుల ఓట్లతో విజయం సాధించిన ఈ ఇద్దరూ ప్రజలకు అందుబాటులో ఉండడం, వారికి సేవచేయటం వారి బాధ్యత. ఆ బాధ్యతల నుంచి తండ్రీ కొడుకులను దూరం చేయాలని కూటమి పెద్దలు కుట్రలు పన్నుతున్నారు. అందులో భాగంగా గత నెల 15న పుంగనూరు పర్యటనకు సిద్ధమైన తండ్రీ కొడుకులను నివాసం నుంచి కదలకుండా హౌస్ అరెస్ట్ చేశారు. అదేమంటే శాంతి భద్రతల కోసం అని పోలీసులు చెప్పడం మరో విడ్డూరం. ఎంపీ, ఎమ్మెల్యే పర్యటనలకు ఎలాంటి ఆటంకం కలగకుండా.. ప్రజలకు సేవ చేయాల్సిన పోలీసులను ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ శ్రేణులపై పగ సాధించడానికి వినియోగించుకుంటోంది. తాజాగా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి నియోజకవర్గ పర్యటన నిమిత్తం గురువారం పుంగనూరుకు చేరుకున్నారు. మాజీ ఎంపీ రెడ్డెప్ప నివాసంలో ఉన్న ఎంపీ మిథున్‌రెడ్డిని హత్య చేసేందుకు టీడీపీ మూకలు రాళ్లు, కర్రలు, కోడి గుడ్లతో దాడులకు తెగబడ్డాయి. ప్రశాంతమైన పుంగనూరులో బీభత్సం సృష్టించాయి. 40 రోజులకు పైగా తండ్రీ కొడుకులను నియోజక వర్గ ప్రజలకు దూరంగా స్వగృహంలో నిర్బంధించి, వారి నివాసానికి వచ్చి వెళ్లేవారి వివరాలను పోలీసులు ఎప్పటికప్పుడు కూటమి పెద్దలకు సమాచారం చేరవేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

నిత్యం దాడులు..దౌర్జన్యాలు

పుంగనూరు, కుప్పం, తంబళ్లపల్లె నియోజకవర్గ పరిధిలో బరితెగించిన టీడీపీ మూకలు వైఎస్సార్‌సీపీ శ్రేణులను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడుతున్నాయి. ప్రతి రోజూ ఏదో ఒక గ్రామంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కూటమి నేతలు దాడులు చేసి తీవ్రంగా గాయపరచారని, వారి ఆస్తులు ధ్వంసం చేశారని, పంట ఉత్పత్తులు నాశనం చేశారనే వార్తలు నిత్యకృత్యమయ్యాయి. అలాగే వైఎస్సార్‌సీపీ శ్రేణులపై తప్పుడు కేసులు బనాయించి అరెస్టులు చేయించటం షరా మామూలైంది. టీడీపీ మూకలే వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు చేసినా, పోలీసులు మాత్రం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలదే తప్పని ఎదురు కేసులు పెడుతుండడంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది పోలీసుల కారణంగా మొత్తం వ్యవస్థకే మకిలి అంటుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్, కార్పొరేషన్, మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేటర్లు, జిల్లా, నియోజకవర్గం, మండల, గ్రామ స్థాయి నాయకులను బెదిరించి, భయపెట్టి, ఆస్తులు ధ్వంసం చేసి, వారిని లొంగదీసుకుంటున్నారు. కూటమి శ్రేణుల అరాచకాలతో పలువురు ఊరొదిలి వెళ్లిపోయారు. మరి కొందరిని ఇప్పటికీ గ్రామాల్లో నిర్బంధించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇంత జరుగుతున్నా, బాధితులు పోలీసులకు ఫోన్ చేసినా స్పందించకపోవడం విస్మయం కలిగిస్తోంది. నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయటం లేదనే ఆరోపణలు వస్తుండం చూస్తుంటే పోలీస్ వ్యవస్థ ఏ పక్షాన కొమ్ము కాస్తోందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఉమ్మడి చిత్తూరు జిల్లా చరిత్రలో ఎన్నడూ జరగని ఈ 40 రోజుల కాలంలో చోటుచేసుకున్న అరాచకాలు, వీటిని నిత్యకృత్యం చేస్తున్న వైనం చూసి స్థానికులు భయకంపితులవుతున్నారు. గడపదాటితే ఎప్పుడు ఏం జరుగుతుందో, ఎవరిపై ఎటువంటి కేసులు పెడతారోనని భయంతో వణికిపోతుండటం కూటమి ప్రభుత్వ తీరుకు నిదర్శనం.





పుంగనూరులో తెలుగుదేశం గూండాలు ధ్వంసం చేసిన ఎంపీ మిథున్‌రెడ్డి వాహనాలు



మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటి వెలుపల దాడులు చేస్తున్న తెలుగుదేశం కార్యకర్తలు

చంద్రబాబు అరాచకానికి నిదర్శనం



శ్రీరంగరాజపురం : రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిపై హత్యాయత్నం, మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటిపై టీడీపీ నేతలు దాడి చేయడం చంద్రబాబు అరాచకానికి నిదర్శనం. తన సొంత నియోజకవర్గంలోని పుంగనూరుకు వెళ్లిన ఎంపీ మిథున్‌రెడ్డిపై దాడి చేయడం, మాజీ ఎంపీ ఇంటిని ధ్వంసం చేయడం, ఆవరణలో ఉన్న కార్లను తగుల పెట్టడం చూస్తుంటే టీడీపీ రాక్షస రాజకీయం చేస్తోందన్న విషయం అర్థమవుతుంది. ఇంత జరుగుతున్నా అక్కడే ఉన్న పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించడం దుర్మార్గం. ఎంపీగా గెలిచిన ప్రజాప్రతినిధులకే రక్షణ లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కనుమరుగవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విష సంస్కృతికి ముఖ్యమంతి చంద్రబాబు నాంది పలికారు. రాష్ట్రంలో ఇంత ఘోరంగా దాడులు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం మరియు న్యాయ వ్యవస్థ స్పందించకపోవడం శోచనీయం. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో ముందు ముందు శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బతింటాయి. ఇకనైనా టీడీపీ ఇలాంటి చర్యలు మానుకోవాలి.

– నారాయణస్వామి, మాజీ డిప్యూటీ సీఎం

ఎంపీపై హత్యాయత్నం హేయం



వి.కోట: పుంగనూరులో ఎంపీ మిథున్ రెడ్డిపై టీడీపీ నాయకులు హత్యాయత్నం చేయడం హేయమైన చర్య. పుంగనూరులో ఇటీవల టీడీపీ నాయకుల చేతుల్లో దెబ్బలు తిన్న వైఎస్సార్‌సీపీ నాయకులను కలవడానికి, మాజీ ఎంపీ రెడ్డెప్ప నివాసానికి విచ్చేసిన ఎంపీ మిథున్‌రెడ్డిపై దాడులు చేయడం దుర్మారం. పుంగనూరు నియోజకవర్గంలో పెద్దిరెడ్డి కుటుంబంపై దాడులు ఆపాలి. ఆ కుటుంబాన్ని అంతం చేయాలని చూస్తున్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రూ.3,000 కోట్లతో ఎన్నో అభివృద్ధి పనులు చేశారు. ఎంపీ మిథున్‌రెడ్డి అనంతపురం – మదనపల్లె, మదనపల్లె– పలమనేరు, మదనపల్లె–తిరుపతి రోడ్లతో పాటూ ఎన్నో బ్రిడ్జిలు నిర్మించారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతి పరులపై కూటమి నాయకులు గతంలో ఏ ప్రభుత్వంలోనూ లేని విధంగా దాడులకు పాల్పడుతూ ప్రాణాలను సైతం హతమారుస్తున్న పరిస్థితులను ప్రజలంతా చూస్తున్నారు. దీనికంతా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తగిన మూల్యం చెల్లించాలి. ఇకనైనా దాడులను ఆపి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలి.

– శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్

తగిన మూల్యం చెల్లించకతప్పదు



వరదయ్యపాళెం: ప్రశాంత వాతావరణంలో ఉన్న పుంగనూరులో టీడీపీ నేతలు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తున్న కూటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. దళిత మాజీ ఎంపీ రెడ్డెప్పను కలిసేందుకు పుంగనూరుకు వెళ్లిన రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిపై హత్యాయత్నం చేయడం, అలాగే రెడ్డెప్పపై, ఆయన ఇంటి పైన రాళ్ల వర్షం కురిపించడం హేయమైన చర్య. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజలకు శాంతిభద్రతలు కరువయ్యాయి. మహిళలు, బాలికలకు రక్షణ కరువైంది. అధికార దర్పంతో ఎలా విర్రవీగుతున్నారో ప్రజలే చూస్తున్నారు. ప్రజాప్రతినిధి మిథున్ రెడ్డి, ఆయన సొంత నియోజకవర్గంలో పర్యటించేందుకు స్వేచ్ఛ లేకుండా టీడీపీ నేతలు అలజడులు సృష్టించడం ఎంతమాత్రమూ సరికాదు. ఇలాంటి సంస్కృతిని గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనుసరించి ఉంటే అప్పట్లో టీడీపీ నేతల పరిస్థితి ఏమై ఉంటుందో ఆలోచించుకోవాలి.

–నూకతోటి రాజేష్,
వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, సత్యవేడు

మిథున్‌రెడ్డిపై హత్యాయత్నం దుర్మార్గం



వి.కోట: ప్రజాప్రతినిధిగా గెలిచిన ఎంపీ మిథున్‌రెడ్డిపై పుంగనూరులో టీడీపీ నేతలు హత్యాయత్నం చేయడం దుర్మార్గం. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి అధికారం చేపట్టి 40 రోజులు కావస్తున్నా రాష్ట్రంలో ఎక్కడ చూసినా హత్యలు, దాడులు, దౌర్జన్యాలు మానభంగాలు పెరిగిపోతున్నాయి. ప్రధానంగా టీడీపీ మూకలు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలపై నిష్కారణంగా దాడులకు తెగబడుతున్నారు. మిథున్‌రెడ్డికి ప్రాణహాని ఉంది. వెంటనే కేంద్ర ప్రభుత్వం సెక్యూరిటీ కల్పించాలి. వైఎస్సార్ సీపీ కార్యకర్తలను వెంటాడి, వేటాడుతున్నారు. అయినా పోలీసులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. పుంగనూరులో అయితే మరీ విడ్డూరంగా దగ్గరే ఉండి టీడీపీ గూండాల దాడులను చూస్తూ ఉండడమేంటి? అసలు రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ ఉందా? కూటమి ప్రభుత్వం అరాచకాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఇప్పటికైనా ఇలాంటి దాడులకు మానుకుని పరిపాలన మీద దృష్టి పెట్టాలి.

–పీఎస్. నాగరాజు,
వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి

న్యూస్‌రీల్

విధిగా కుష్టు వ్యాధి సర్వే



సర్వే తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కుష్టు వ్యాధి సర్వేను విధిగా చేపట్టాలని డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి ఆదేశించారు. చిత్తూరు నగరంలోని టెలిఫోన్ కాలనీ, గిరింపేటలో గురువారం ఇంటింటా కుష్టు వ్యాధి సర్వే, బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. సర్వే పనితీరును పరిశీలించారు. సర్వే విధివిధానాలపై ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలను ప్రశ్నించారు. కుష్టు వ్యాధి సర్వేలో నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. కచ్చితంగా ఇంటింటికీ వెళ్లి మచ్చలను గుర్తించాలని సూచించారు. అనుమానిత కేసుగా నమోదైతే వెంటనే వారికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి వైద్య సేవలు అందించాలన్నారు. అలాగే బీసీజీ వ్యాక్సిన్‌ను అర్హులందరూ వేసుకునేలా చూడాలన్నారు. నిర్ణీత సమయంలోపు వంద శాతం వ్యాక్సినేషన్‌ను పూర్తి చేయాలని ఆమె సూచించారు.

సమగ్రశిక్ష శాఖ ఉద్యోగులకు జీతాలు జమ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా సమగ్రశిక్ష శాఖ పరిధిలో అన్ని మండలాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు రెండు నెలల జీతాల బడ్జెట్ ను విడుదల చేశారు. ఈ మేరకు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో విధులు నిర్వహిస్తున్న సీఆర్‌పీ, ఐఈఆర్‌టీ, డేటాఎంట్రీ, ఎంఐఎస్, తదితర కేడర్ల ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు జీతాలు మంజూరు చేయనున్నారు. జిల్లా సమగ్రశిక్ష శాఖ అధికారులు ఉద్యోగులు మే నెల జీతాలు గురువారం ఖాతాల్లో జమ చేశారు. జూన్ నెల జీతాలను రెండు రోజుల్లో జమచేయనున్నట్లు సమగ్రశిక్ష శాఖ అధికారులు వెల్లడించారు

ఎంఈఓల వివరాలు సేకరణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పనిచేస్తున్న ఎంఈఓల వివరాలను జిల్లా విద్యాశాఖ అధికారులు సేకరిస్తున్నారు. ఎంఈఓ1, 2ల వివరాలను సేకరించి పంపాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు డీఈఓ కార్యాలయానికి ఉత్తర్వులు పంపారు. ఆ ఉత్తర్వుల మేరకు జిల్లాలోని అన్ని మండలాల ఎంఈఓల సమగ్ర వివరాలను సేకరించే పనిలో డీఈఓ కార్యాలయ సిబ్బంది నిమగ్నమయ్యారు. ఈ నెల చివరిలోపు సమగ్ర వివరాలను పంపించేందుకు నివేదికలు సిద్ధం చేస్తున్నారు.

ఎస్‌ఈగా సురేంద్రనాయుడు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఎస్‌ఈగా ఉన్న సురేంద్రనాయుడును రెగులర్ చేస్తూ సీఎండీ సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశారు. కార్పొరేటర్ కార్యాలయ ఓఎన్‌ఎం (ఆపరేషన్ అండ్ మేనేజ్‌మెంట్) జీఎంగా ఉన్న ఆయనకు ఇన్‌చార్జి ఎస్‌ఈగా అదనపు బాధ్యతలు ఇచ్చిన విషయం తెలిసిందే. సెలవులో ఉన్న గత ఎస్‌ఈ కృష్ణారెడ్డికి ఓఎన్‌ఎం జీఎం బాధ్యతలు అప్పగించారు.

'అవార్డుల'కు గడువు పెంపు

చిత్తూరు కలెక్టరేట్ : జాతీయ ఉపాధ్యాయ అవార్డుల దరఖాస్తుకు ఈ నెల 21 వరకు గడువు పొడిగించినట్లు డీఈఓ దేవరాజు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో జాతీయ ఉపాధ్యాయ అవార్డులకు అర్హత, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదేళ్ల సర్వీసు పూర్తయిన ఉపాధ్యాయులు అవార్డులకు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు www. national awards to teachers.education.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ కోరారు.

స్టోర్స్ పరిశీలన

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో జిల్లా స్టోర్స్‌ను క్వాలిటీ కంట్రోల్ ఈఈ ఆశీర్వాదం గురువారం పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఆయన విద్యుత్ పరికరాల నాణ్యతను తనిఖీ చేశారు. పరికరాలు ఎక్కడ నుంచి వస్తున్నాయి అనే వివరాలు డీఈ జయప్రకాష్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈలు వివేకానందరెడ్డి, బాలగుణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ ప్రత్యేక క్యాంపులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నారు. ఈ మేరకు కలెక్టరేట్ నుంచి గురువారం క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలిచ్చారు. జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న ఆధార్ సర్వీసులను అప్‌డేట్ చేయనున్నారు. ప్రతి మండలంలో క్యాంపులు నిర్వహించనున్నారు. ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, డాక్యుమెంట్, బయోమెట్రిక్ అప్‌డేట్‌ను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నారు. క్షేత్రస్థాయి అధికారులు ఆధార్ అప్‌డేట్ క్యాంపులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

ఎడ్యుకేషనల్ హబ్‌గా కుప్పం

కుప్పం: ఎడ్యుకేషనల్ హబ్‌గా కుప్పం పట్టణాన్ని తయారుచేయడానికి చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. కుప్పం మండల సచివాలయంలో గురువారం ప్రజా వినతుల స్వీకరణ పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, కేంద్రీయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు అవసరమైన భూమి పరిశీలించనున్నట్లు చెప్పారు. దీంతో ఉన్నత విద్యా కేంద్రంగా కుప్పం అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కార వేదిక ద్వారా రెవెన్యూకు సంబంధించి అధికంగా ఫిర్యాదులు వస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో పాటు సామాజిక పింఛన్, గృహ నిర్మాణం, మౌలిక వసతులు కల్పన వంటి అంశాలకు సంబంధించి ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన తెలిపారు. 15 రోజుల వ్యవధిలో ఇక్కడ అందిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని క్షేత్ర స్థాయి అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ పి.శ్రీనివాసులు, కడా ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

విద్యార్థులకు రవాణా భత్యం విడుదల

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న అవుట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్స్ (ఓఓఎస్‌సీ) విద్యార్థులకు రవాణాభత్యం విడుదల చేశారు. ఈ మేరకు గత విద్యా సంవత్సరానికి గాను ఒక్కొక్క విద్యార్థికి నెలకు రూ.600 చొప్పున 10 నెలలకు రూ.6 వేలను విద్యార్థుల బ్యాంకు ఖాతాలకు జమచేయనున్నారు. ఈ మేరకు జిల్లా సమగ్రశిక్ష శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల్లో 2,911, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 433 మొత్తం 3,071 మంది విద్యార్థులకు నగదు జమచేయనున్నారు. ఇందుకు రూ.1.84 కోట్ల బడ్జెట్‌ను రాష్ట్ర ఉన్నతాధికారులు విడుదల చేశారు.

ప్రమాదాల నియంత్రణకు చర్యలు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో విద్యుత్ ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్రనాయుడు తెలిపారు. ఈఈ, డీఈ, ఏఈలతో గురువారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పలు ప్రాంతాల్లో వర్షాలు పడుతున్నాయని వాలిన కరెంటు స్తంభాలు, లైన్స్‌ను గుర్తించి నివేదిక ఇవ్వాలన్నారు. క్షేత్ర స్థాయిలో చేసిన పనులను ఒక పుస్తకంలో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఈలు మునిచంద్ర, హరి పాల్గొన్నారు.

క్లుప్తంగా

దివ్యాంగులకు స్కాలర్‌షిప్‌లు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అర్హులైన దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వం అందజేసే స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. 2024–25 విద్యాసంవత్సరానికి 9, 10, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఇతర ఉన్నత విద్యనభ్యసిస్తున్న దివ్యాంగులు స్కాలర్‌షిప్‌లకు అర్హులు. ఆగస్టు 31న రెన్యూవల్‌కు, అక్టోబర్ 31 వరకు కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. జిల్లా వ్యాప్తంగా అర్హులైన దివ్యాంగులు www. scholarships. gov. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా దివ్యాంగులశాఖ అధికారులు వెల్లడించారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

పలమనేరు: పట్టపగలే ఇంట్లో బీరువాలో ఉన్న నగలు, నగదు చోరీ చేసిన సంఘటన మండలంలో గురువారం వెలుగుచూసింది. స్థానికులు, బాధితుల కథనం మేరకు, నడిమిదొడ్డిపల్లికి చెందిన రైతులు కొందరు గ్రామానికి కాస్త దూరంగా రోడ్డు పక్కనే పొలాల వద్ద ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారు. ఈ క్రమంలో ఆ ఇళ్లకు చెందిన మునస్వామిరెడ్డి భార్య యశోదమ్మ మధ్యాహ్నం ఇంటి పక్కనే పశువులకు గడ్డి కోస్తుండగా, దుండగుడు ఇంట్లోకి చొరబడ్డాడు. బీరువా తాళాన్ని స్క్రూ డ్రైవర్‌తో తీసి అందులోని బంగారు, వెండి ఆభరణాలు, కొంత నగదును తస్కరించి, వెళుతుండగా యశోద గమనించింది. ‘ఎవరు నువ్వు.. మా ఇంటి దగ్గర ఏం పని నీకు?’ అని అతడిని ప్రశ్నించింది. పానీ చాహీయే అంటూ సైగ చేస్తూ చెప్పాడు. దీంతో ఆమె నీరు తీసుకురావడానికి ఇంట్లోకి వెళ్లి చూస్తే బీరువా తెరిచి ఉంది. వెంటనే అరుస్తూ బయటకు పరుగెత్తి వచ్చేలోపు ఆ వ్యక్తి అక్కడి నుంచి ఉడాయించాడు. అక్కడికొచ్చిన వ్యక్తి హెల్మెట్‌తోపాటు నెంబర్ ప్లేట్ లేని బైక్‌పై ఉపయోగించినట్లు సమీపంలో ఉన్న పాలడెయిరీ వద్ద అమర్చిన సీసీ కెమెరాల్లో కనిపించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పలమనేరు పోలీసులు కేసును విచారిస్తున్నారు.

ఒడిశా వ్యక్తి ఆత్మహత్య

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ఒడిశాకు చెందిన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు రెడ్డిగుంట సమీపంలో ఉన్న కోళ్ల ఫామ్‌లో నీలాద్రి (56) కూలీగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి భార్యతో వాగ్వాదం చోటుచేసుకుంది. తరువాత ఇద్దరూ నిద్రపోయారు. అర్ధరాత్రిలో లేచిన నీలాద్రి తాడుతో ఇంటి పైకప్పునకు ఉరేసుకున్నాడు. ఉదయాన్నే గుర్తించిన భార్య స్థానికుల సాయంతో పోలీసులకు సమాచారమందించింది. మృతదేహానికి చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ విశ్వనాథ్ రెడ్డి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరానికి చెందిన సులోచన (30) అదృశ్యమైనట్లు టూటౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. సీఐ ఉలసయ్య కథనం మేరకు, నగరంలోని తేనెబండ సత్తెమ్మ గుడి వీధికి చెందిన సులోచన కొన్నేళ్లుగా భర్తకు దూరంగా ఉంటోంది. గత నెల 21వ తేదీ ఇంటి నుంచి వెళ్లిన ఈమె తిరిగిరాలేదు. బంధువులు, తెలిసినవాళ్ల ఇళ్లలో వెతికినా ప్రయోజనం లేదు. దీంతో సులోచన తల్లి సరళ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.



వారికే ‘అగ్ర’తాంబూలం

- పేర్ల చివరన ఉన్న ఆ మూడక్షరాలే ప్రామాణికం
- పోలీసు శాఖ బదిలీల్లో కూటమి సర్కారు నిర్వాకం
- డీఎస్పీల నుంచి ఎస్‌ఐల వరకు అన్వేషణ
- ఇప్పటికే స్థానాలు ఖరారు చేసుకున్న ఉద్దండులు



చిత్తూరు అర్బన్: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం రావడం .. జిల్లా ఎస్పీలకు స్థాన చలనం కల్పించడం ఇప్పటికే పూర్తయ్యింది. మిగిలింది ఏఎస్పీల నుంచి ఎస్‌ఐల వరకు మార్పు చేయడానికి తెరవెనుక పావులు వేగంగా కదులుతున్నాయి. తమను ప్రసన్నం చేసుకుంటున్న ఖాకీలను ఎక్కడెక్కడ వేయాలోనని నేతలు ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఇందులో ఖాకీల పేర్ల చివరన ఉన్న మూడక్షరాలకే తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు గుసగుసలు బలంగా వినిపిస్తున్నాయి. ఆ మూడక్షరాలున్న అధికారులకే ‘అగ్ర’తాంబూలం ఇచ్చి విధులు కేటాయించనున్నట్లు సమాచారం.

డీఎస్పీలపైనే గురి

జిల్లా ఎస్పీల బదిలీల్లో తిరుపతి ఎస్పీని బదిలీ చేసి, ఆయన స్థానంలో తెలంగాణ క్యాడర్‌కు చెందిన సుబ్బరాయుడును నియమించారు. చిత్తూరులో మణికంఠ చందోలును కొనసాగించేందుకు ప్రభుత్వం సుముఖంగానే ఉంది. మరో రెండేళ్ల వరకు ఈయన ఇక్కడే విధులు నిర్వర్తించే అవకాశం ఉంది. ఎస్పీల మార్పు తరువాత ఏఎస్పీల బదిలీలు చేపట్టాలి. ఇది పూర్తిగా ఆర్మ్‌డు రిజర్వు, పరిపాలన విభాగాలకు సంబంధించింది కావడం, ప్రజలతో మమేకమైన పోస్టులు కాకపోవడంతో ఎవరెవరు వస్తారు..? ఎవరు వెళుతున్నారనేదానిపై ఎవరికీ పెద్దగా ఆసక్తిలేదు. ఇక మిగిలింది డీఎస్పీలు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు(సీఐ), ఎస్‌ఐలే. ఇపుడు చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అందరి దృష్టి వీటిపైనే ఉంది. ఒక్కో డీఎస్పీ పరిధిలోకి మూడు అసెంబ్లీ నియోజకవర్గాల వరకు వస్తుండడంతో ఏరికోరి ఎవర్ని నియమించాలనే విషయంపై అధికార పార్టీ నాయకుల్లో పెద్ద కసరత్తే జరుగుతోంది. చిత్తూరు జిల్లాలో ఇద్దరు, తిరుపతి జిల్లాలో ముగ్గురు నాయకులు, డీఎస్పీల బదిలీల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా ఎవరెవరిని జిల్లా నుంచి పంపించేయాలనే దానిపై అందరూ కలిసికట్టుగా ఒక్క తాటిపైకి వచ్చినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో జిల్లాలోపలకు వచ్చేవాళ్లకు ‘ఆ మూడక్షరాలు’ ప్రామాణికం అనే విషయం చక్కర్లు కొడుతోంది. దీంతో ‘వాళ్ల’ను మాత్రమే ఎక్కడి నుంచి తీసుకురావాలనే విషయంపై చర్చ జరుగుతోంది.

ఇన్.. అవుట్

జిల్లా నుంచి బయటకు వెళ్లేవారిలో చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి నుంచి నగరి డీఎస్పీ నరసింహమూర్తి, గూడూరు డీఎస్పీ సుబ్రమణ్యంరెడ్డి, తిరుమల డీఎస్పీ శ్రీనివాసాచారి ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. పలమనేరు, చంద్రగిరి డీఎస్పీ స్థానాలు ప్రస్తుతం అటాచ్‌మెంట్‌లో నడుస్తుండడంతో ఇక్కడకు బలమైన వ్యక్తులను తెప్పించేందుకు నేతలు పట్టుగా ఉన్నట్లు తెలుస్తోంది. తిరుపతి అర్బన్‌లో ఉన్న రవి మనోహరాచారి, కుప్పం డీఎస్పీ శ్రీనాథ్‌ను కొనసాగించే అవకాశం ఉంది. చిత్తూరు, రేణిగుంట, శ్రీకాళహస్తి, నగరి స్థానాలకు డేగల ప్రభాకర్ నాయుడు, కొండయ్య నాయుడు, మురళి నాయుడు పేర్లు వినిపిస్తున్నాయి. ఎస్పీ పోస్టు తరువాత అత్యంత బలమైన స్పెషల్‌బ్రాంచ్ విభాగంపై కూడా అధికార పార్టీ నాయకులు దృష్టి పెట్టారు. తిరుపతికి ఎస్బీవీ రామ్‌కుమార్ నాయుడును డీఎస్పీగా నియమించాలని, చిత్తూరుకు సీఐగా ఆదినారాయణ నాయుడును నియమించేందుకు కసరత్తు పూర్తయినట్లు జిల్లా పోలీసుశాఖలో చర్చ నడుస్తోంది. అయితే వీళ్లలో ఒకరికి స్పెషల్ బ్రాంచ్ ఇష్టం లేకపోవడంతో గూడూరు లాంటి పేరున్న సబ్-డివిజన్‌కు పంపించేందుకు ప్రయత్నిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

సీఐలు, ఎస్‌ఐలకూ తప్పదు

డీఎస్పీల పోస్టుల్లో ఎవరెవర్ని నియమించాలనే ప్రక్రియతో పాటు సీఐలు, ఎస్‌ఐ బదిలీల్లో స్థానిక ఎమ్మెల్యేలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే కొందరు అధికారులు ఆయా ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకుని, స్థానాలను ఖరారు చేసుకున్నట్లు తెలుస్తోంది. చిత్తూరు వన్‌టౌన్, టూటౌన్, వెస్ట్, ఈస్ట్, బంగారుపాళెం, గంగాధరనెల్లూరు, నగరి, పలమనేరు, పుంగనూరు, పూతలపట్టు, చంద్రగిరి, తిరుపతి వెస్ట్, యూనివర్సిటీ, సీసీఎస్, అలిపిరి, ఎంఆర్.పల్లె, రేణిగుంట, గూడూరు, శ్రీకాళహస్తి సీఐ స్థానాలతో పాటు ఎస్‌ఐలకు సైతం స్థాన చలనం తప్పదనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. రెండు రోజుల్లో ఏఎస్పీ, డీఎస్పీల బదిలీల ఉత్తర్వులు వెలువడనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. వచ్చేవారం సీఐలు, ఎస్‌ఐలకు స్థాన చలనం తప్పదన్న చర్చ మొదలైంది.

ప్రజాస్వామ్యాన్ని కాపాడండి



సమావేశంలో మాట్లాడుతున్న కుప్పయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు

శ్రీరంగరాజపురం : కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, దాడులు, హత్యలు ఇకనైనా ఆపాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కుప్పయ్య కోరారు. ఆయన మండల పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ నేతల దాడిలో గాయపడిన వారిని పరామర్శించేందుకు బుధవారం పుంగనూరుకు వెళ్లిన ఎంపీ మిథున్ రెడ్డిపై హత్యాయత్నం, మాజీ ఎంపీ రెడ్డెప్పపై దాడి చేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. టీడీపీ నాయకులు రాళ్లు, రాడ్లు, కర్రలతో దాడులు చేయడం అత్యంత దుర్మార్గమని చెప్పారు. ప్రజల చేత ఎన్నికైన ఎంపీ మిథున్‌రెడ్డిపై, దళితుడైన మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటిపై దాడి చేస్తుంటే రక్షణ కల్పించలేని ఈ ప్రభుత్వం సామాన్యులకు ఎలా భద్రత కల్పిస్తుందని ప్రశ్నించారు. దాడులు చేస్తుండగా, రక్షణ కల్పించాల్సిన పోలీసులు చోద్యం చూడడడం ప్రజలకు ఎలాంటి సందేశం ఇస్తున్నారని నిలదీశారు. గతంలో ఎన్నడూ లేని సంస్కృతికి చంద్రబాబు నాంది పలికారన్నారు. రాష్ట్రంలో లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు అవుతోందన్నారు. నెల రోజుల టీడీపీ పాలనలో జరిగిన దాడులు, చిన్నారులపై అఘాయిత్యాలు, హత్యలు, మానభంగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మణి, జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, నాయకులు జనార్దన్, భూపతిరెడ్డి, హరిరెడ్డి, బాబు, సెల్వం, కరుణాకర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మిథున్‌పై దాడి అరాచకానికి నిదర్శనం



హరికృష్ణ

గంగాధరనెల్లూరు: రాజంపేట ఎంపీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిపై దాడి చేయడం టీడీపీ అరాచకానికి నిదర్శమని వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆనగంటి హరికృష్ణ దుయ్యబట్టారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హరికృష్ణ మాట్లాడుతూ, చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంట్లో ఉన్న మిథున్‌రెడ్డిపై టీడీపీ మూకలు పథకం ప్రకారం రాళ్లదాడి చేయడం, కారును తగలబెట్టడం దుర్మార్గమని ఖండించారు. మూడుసార్లు ఎంపీగా గెలిచిన వ్యక్తికే రక్షణ లేకపోతే ఇక సామాన్య కార్యకర్తల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో శాంతి భద్రతలు కనుమరుగతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ శాంతిభద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైలుకింద పడి వృద్ధుడి మృతి



వృద్ధుని మృతదేహం

నగరి : మండలంలోని వెంకట నరసింహ రాజువారిపేట – నగరి రైల్వేస్టేషన్ మధ్య వృద్ధుడు మృతి చెందిన సంఘటన గురువారం వెలుగుచూసింది. రేణిగుంట రైల్వే ఎస్‌ఐ రవి కథనం మేరకు ఎగువ రైలు మార్గంలో సుమారు 65 ఏళ్ల వయసున్న వ్యక్తి ఉదయం 5.30 గంటలకు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు సిమెంటు కలర్ హాఫ్ టీషర్టు, బ్లూ కలర్ చెక్స్ లుంగీ ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. వివరాలు తెలిసిన వారు 99631 26343, 94406 27649ను సంప్రదించాలన్నారు. మృతదేహాన్ని నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

జవాన్‌పై దాడి



చికిత్స పొందుతున్న జవాన్

నింద్ర: ఆర్మీ జవాన్‌పై కొందరు యువకులు దాడి చేసిన సంఘటన గురువారం సాయంత్రం మండలంలో వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు, అగరంపేటకు చెందిన ప్రకాష్(24) రాజస్థాన్‌లో జవాన్‌గా పనిచేస్తున్నారు. గ్రామంలో మొహర్రం పండుగ సందర్భంగా సెలవు పెట్టి వచ్చారు. అయితే పండుగ రోజు గ్రామంలో రెండు వర్గాల మధ్య గొడవలు చోటుచేసుకున్నాయి. మరుసటి రోజు గురువారం సాయంత్రం ఇంటి వద్ద ఉన్న ప్రకాష్‌పై దళితవాడకు చెందిన రాజా, మునిశంకర్, రుబన్ దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ప్రకాష్‌ను నగరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వక్రీకరించి విషప్రచారం

- మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి : తమిళనాడు తిరుచందూర్ ఆలయంలో పారిశుద్ధ్య కార్మికులతో నవ్వుతూ సెల్ఫీ తీసుకున్నా.. వాస్తవాలను వక్రీకరించి కొన్ని మీడియాలు ఊదరగొట్టడం, టీడీపీ నేతలు దుష్ప్రచారం చేయడంపై మాజీ మంత్రి ఆర్కే రోజా స్పందించారు. వాస్తవాలను మరుగునపెట్టి వక్రీకరించి దుష్ప్రచారం చేయడం తగదన్నారు. సుబ్రమణ్యస్వామిని దర్శించుకుని వస్తుండగా పలువురు తనతో సెల్ఫీలు తీసుకున్నారని.. అందులో భాగంగా పారిశుద్ధ్య కార్మికులు కూడా రాగా, కింద చెమ్మగా ఉంది.. నెమ్మదిగా రమ్మని చేయి చూపానని.. ఆపై వారు వచ్చి సెల్ఫీ తీసుకున్నారని చెప్పారు. దాన్ని వక్రీకరించి తానేదో వారిని రావొద్దన్నట్టు చూపడం.. దానిపై టీడీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇది తనపై అక్కసుతో పనిగట్టుకుని చేసిన ప్రచారమేనన్నారు. కార్మికుల పట్ల తానెప్పుడూ, ఎక్కడా చులకన భావం ప్రదర్శించనన్నారు. కరోనా కష్టకాలంలో తాను పారిశుద్ధ్య కార్మికులకు ఎంత సహకారం అందించానో వారికే తెలుసని రోజా చెప్పారు.

హెల్మెట్ తప్పనిసరిగా వాడాలి

చిత్తూరు అర్బన్: ద్విచక్రవాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను తప్పనిసరిగా ఉపయోగించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణ, హెల్మెట్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చిత్తూరు నగరంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక జిల్లా న్యాయస్థానాల సముదాయం నుంచి గాంధీ విగ్రహం వరకు నిర్వహించిన ర్యాలీలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా జడ్జి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు అత్యధికంగా ద్విచక్ర వాహనాలు నిర్లక్ష్యంగా నడుపుతున్న వారివల్లే జరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయన్నారు. వీటిని నివారించడానికి రాష్ట్ర హైకోర్టు సైతం హెల్మెట్ వాడకం తప్పనిసరి చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిందన్నారు. ప్రజల్లో అవగాహన తీసుకురావడానికి పోలీసుశాఖ సైతం విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. న్యాయమూర్తి వెన్నెల, పబ్లిక్ ప్రాసిక్యూటర్ లోకనాథరెడ్డి పాల్గొన్నారు.

22 నుంచి శిక్షా సప్తాహ్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులను భాగస్వామ్యం చేయనున్నారు. జాతీయ విద్యావిధానం లో సంస్కరణలు తెలియజేసేందుకు శిక్షాసప్తాహ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు అమలు చేయాల్సిన కార్యక్రమాల షెడ్యూల్‌ను డీవైఈఓ, ఎంఈఓలకు పంపారు. ఆ షెడ్యూల్ ప్రకారం తప్పనిసరిగా కార్యక్రమాలను నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారులు ఆదేశించారు.

విద్యుత్ సేవా లోపానికి పరిహారం

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ వినియోగదారులకు అందించే సేవల్లో చోటుచేసుకున్న జాప్యానికిగాను పరిహారంగా ఉమ్మడి జిల్లాలో రూ.24.89 లక్షలు వినియోగదారుల ఖాతాలకు జమచేయాలని ఏపీ ఈఆర్సీ ఉత్తర్వులు జారీ చేసింది. ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు జిల్లాలో పలు సమస్యలపై అందిన ఫిర్యాదులను పరిష్కారించడంలో జాప్యం జరిగినందుకు ఈ రుసుంను దాదాపు 100 మంది ఏఈల జీతాల నుంచి రికవరీ చేయనున్నారు. కరెంటు పోయింది ఎప్పుడు వస్తుంది, స్తంభాలు మార్చండి, లైన్‌కు అల్లుకున్న తీగలు తీయండి వంటి సాధారణ సమస్యలపై ఫ్యూజ్ ఆఫ్ కాల్స్‌కు ఫిర్యాదులు వచ్చాయి. వీటితో పాటు పలు అభివృద్ధి పనుల్లో భాగంగా నూతన సర్వీసులు రిలీజ్ చేయడంలో ఆలస్యం అయినందుకు, సర్వీసులు రిలీజ్ అయినప్పటికీ, పనులు చేసుకోవడానికి అనుమతులు ఇవ్వలేదని వినియోగదారులు సమస్యలు తెలిపారు. వీటికి ఇంత నష్ట పరిహారం అవసరమని ఏపీ ఈఆర్సీకి ఉన్నతాధికారులు నివేదించారు. తదనంతరం అనుమతులు వచ్చాయి. మొత్తం 3753 ఫిర్యాదులకు రూ.24.89 లక్షలను సంబంధిత వినియోగదారులకు ఖాతాలకు వేయాలని ఆదేశించారు.

డివిజన్	ఫ్యూజ్‌ఆఫ్ కాల్స్	మొత్తం సర్వీసులు	రిలీజ్ మంజూరు	మొత్తం	అంచనా	మొత్తం
చిత్తూరు రూరల్స్	103	515	8	68000	1	700
చిత్తూరుటౌన్	323	16150	32	197600	6	64100
మదనపల్లె	114	5700	16	41200	14	21800
పీలేరు	73	3650	9	28000	3	6400
పుంగనూరు	188	9400	161	648700	14	29500
పుత్తూరు	172	8600	101	403800	14	64300
తిరుపతి రూరల్స్	102	5100	32	135600	7	26900
మొత్తం	3,092	1,54,600	464	18,11,100	197	5,23,300

మెరుగైన వైద్యం అందించండి



వైద్యులతో చర్చిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



ఆస్పత్రిని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్

వి.కోట: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సూచించారు. ఆయన స్థానిక సీహెచ్‌సీని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ రిజిస్టర్, మందుల గదిని, రోగుల అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. అనంతరం వైద్యులతో మాట్లాడుతూ ఇటీవల విష జ్వరాలు ప్రబలుతున్నాయని, జ్వర బాధితులపై ప్రత్యేక దృష్టి సారించి తగు చికిత్సలు అందించాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 152 మంది స్పెషలిస్టు డాక్టర్లను తీసేయడం వల్ల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్యం చాలా కష్టతరంగా మారిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మురళి, సల్మా, గుడిపల్లె జెడ్పీటీసీ కృష్ణమూర్తి, గిరిబాబు, మోహన్‌రాజు పాల్గొన్నారు.

ప్రేమ విఫలమై యువతి ఆత్మహత్య



విద్య (ఫైల్)

ఐరాల: ప్రేమ విఫలమై మనస్తాపానికి గురై ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని చిగరపల్లె దళితవాడలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రామ్మోహన్ కథనం మేరకు, చిగరపల్లె దళితవాడకు చెందిన జగన్నాథం, చిట్టి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె విద్య(22) చిత్తూరు ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ చదువుతున్న సమయంలో అదే కళాశాలలో చదువుతున్న గంగాధరనెల్లూరు మండలం వెంకటాపురానికి చెందిన దుర్గాప్రసాద్‌ను ప్రేమించింది. 2023లో డిగ్రీ పూర్తయ్యాక ఇంటి వద్దే ఉంటోంది. అయితే ఇటీవల దుర్గాప్రసాద్ విద్య ప్రేమను నిరాకరించడంతో మనస్తాపానికి గురై బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. తల్లిదండ్రులు గమనించి విద్యను జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. తన కుమార్తె మరణానికి దుర్గాప్రసాద్ కారణమంటూ తండ్రి జగన్నాథం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మృతదేహంతో నిరసన

విద్య మృతదేహంతో అగరంపల్లె వద్ద చిగరపల్లెకు చెందిన గణేష్‌ప్రసాద్‌రెడ్డి, నటరాజ్, కుటుంబ సభ్యులు నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ ఇది ముమ్మాటికి ప్రేరేపిత హత్యని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే దుర్గాప్రసాద్‌ను అరెస్ట్ చేసి విద్యా కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

కుళ్లిన కూరగాయలతోనే భక్తులకు భోజనాలు!

తిరుమల: తిరుమలలోని కౌస్తుభం విశ్రాంతి భవనం సమీపంలో ఉన్న బాలాజీ భవన్ హోటల్ భక్తుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించడాన్ని టీటీడీ గుర్తించింది. ఇటీవల కొందరు శ్రీవారి భక్తులు ఈ హోటల్‌లో భోజనం చేసి అస్వస్థతకు గురయ్యారని, యాత్రికుల నుంచి ఈమెయిల్ ఫిర్యాదులు అందడంతో ఫుడ్ సేఫ్టీ విభాగం (ఎఫ్‌ఎస్‌డీ) అధికారులతో కలిసి టీటీడీ ఈవో శ్యామలరావు గురువారం ఈ హోటల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హోటల్‌లోని ఆహార పదార్థాలు, ముడి సరుకుల నిల్వ, శుభ్రపరిచే విధానం తదితర పద్ధతులను పరిశీలించారు. చాలా కూరగాయలు కుళ్లిపోయినట్లు గుర్తించారు. పారిశుద్ధ్య చర్యలు కూడా నాసిరకంగా ఉండటాన్ని గమనించారు. ఈవో మీడియాతో మాట్లాడుతూ..హోటల్ నిర్వాహకులు ఆహార భద్రతా నిబంధనలను పాటించడం లేదని, అపరిశుభ్రత మధ్యే హోటల్‌లో ఆహారాన్ని తయారు చేస్తున్నట్లు తెలిపారు. తిరుమలలోని హోటళ్ల పరిశుభ్రమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో, భవిష్యత్తులో ఇలాంటి తనిఖీలు మరిన్ని నిర్వహిస్తామని చెప్పారు. ఎఫ్‌ఎస్‌డీ డైరెక్టర్ మాట్లాడుతూ..తనిఖీల్లో ఈ హోటల్‌లో పూర్తిగా ఆహార భద్రతా నిబంధనలను పాటించలేదని తేలిందన్నారు. ఇక్కడి వంట గదిని వెంటనే మూసివేస్తామని, విచారణ జరిపిన హోటల్‌పై చర్యలు తీసుకుంటామన్నారు.

‘మొబైల్ హార్ట్’తో 500 సెల్ ఫోన్లు రికవరీ



రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను మీడియాకు చూపుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైమ్: రూ.90లక్షల విలువ చేసే 500 సెల్ ఫోన్లు రికవరీ చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు వెల్లడించారు. గురువారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. తిరుపతి జిల్లా పరిధిలో పోగొట్టుకున్న వారి సెల్‌ఫోన్ల కోసం ప్రత్యేకంగా జిల్లా పోలీసులు ఏర్పాటు చేసిన ‘మొబైల్ హార్ట్’ (పోలీస్ వాట్సాప్ నంబర్ 9490617873) అప్లికేషన్‌కు వచ్చిన ఫిర్యాదులపై గతంలో రూ.5.45 కోట్ల విలువచేసే 3030 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. తిరిగి తాజాగా పదో విడతలో ఇప్పుడు 500 సెల్‌ఫోన్లను సైబర్ క్రైమ్ పోలీసులు రికవరీ చేశారన్నారు. ప్రధానంగా తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులు మొబైల్ పోగొట్టుకుంటున్నారని, అలాగే కొన్ని దొంగతనానికి గురవుతున్నాయని తెలిపారు. అలాంటి వారంతా ‘మొబైల్ హార్ట్’ కు హాయ్ అని మెస్సేజ్ చేస్తే లింకు వస్తుందని, అందులో వారి వివరాలను పూర్తి చేయాలన్నారు. సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్)లో ఇది నమోదవుతుందన్నారు. సెల్‌ఫోన్‌లో ఉన్న సమాచారం దుర్వినియోగం కాకుండా ఆ ఫోన్ బ్లాక్ అవుతుందన్నారు. దాని ద్వారానే సెల్‌ఫోన్లను త్వరగా రికవరీ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. రికవరీ చేసిన మొబైళ్లన్నీ ఆంధ్రప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రం నుంచి తీసుకొచ్చామన్నారు. సెల్‌ఫోన్ల దుకాణాల యజమానులు, నిర్వాహకులు అజ్ఞాత వ్యక్తుల నుంచి సెకండ్ హ్యాండ్ ఫోన్లు కొనుగోలు చేయరాదన్నారు. కేసును ఛేదించడంలో ఏఎస్పీ వెంకట్రావు, సైబర్ సీఐ వినోద్ కుమార్, సిబ్బంది ఎంతగానో కృషి చేశారన్నారు. అనంతరం సైబర్ సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.